సూర్య
నేటి దినపత్రిక
18వ
www.suryaa.com
ఏలూరు జిల్లా, పశ్చిమ గోదావరి జిల్లా
శుక్రవారం,7 ఫిబ్రవరి 2025 8 పేజీలు

## సూర్య పత్రిక విలేఖరి

# వెంకటేశ్వరరావుకు భార్య వియోగం



**పాలకోడేరు,మేజర్‌న్యూస్:** పాలకోడేరు మండల కేంద్రం సూర్య విలేఖరి పొన్నమండ వెంకటేశ్వర రావు భార్య సునీల (35) గురువారం మృతి చెందారు .బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో గత 10 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సునీల డిఆర్‌డీఏలో విఓఏగా పనిచేస్తూ అందరితో కలుపు గోలుగా వుండేవారు. ఈమె మృతి వార్త తెలిసిన వెంటనే గ్రామ సర్పంచ్ శివాజీ రాజు, పలువురు ఎంపీటీసీలు, వార్డ్‌సభ్యులు, పత్రికా విలేఖరులు,యానిమేటర్లు, డ్వాక్రా సంఘాల సభ్యులు విచ్చేసి నివాళులు అర్పించారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలకు

# కట్టుదిట్టమైన ఏర్పాట్లు

### - ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఖచ్చితంగా అమలు చేయాలి





**ఏలూరు,మేజర్‌న్యూస్ :** తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పకడ్బందీ గా నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్‌కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని విసి సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులతో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోపట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తిచేయ్యాలన్నారు. ఎన్నికల ప్రవర్తనానియమావళి ఖచ్చితంగా అమలయ్యేలా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

ఆయా అధికారుల వారీగా వారు నిర్వర్తించే విధులను కలెక్టర్ వివరించారు. ఎన్నికల నిర్వహణలో అనుభవజ్ఞులతో ఈనెల 12వ తేదీ, 22వ తేదీ శిక్షణా నిర్వహణకు ఏర్పాట్లుచేయాలన్నారు. మైక్రో అబ్జర్వర్లు కూడా శిక్షణ అందించాలన్నారు.వట్లూరు సర్. సిఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కశాళాలలో ఏర్పాటుచేసే రిసెప్షన్ సెంటర్లో అవసరమైన లైటింగ్‌ను సిద్ధం చేసుకోవాలన్నారు.ఆయా జిల్లాలనుండి వచ్చే బ్యాలెట్ బాక్సులను, ఇతర రాజ్యాంగబద్ధమైన పత్రాలను స్వీక రించిన అనంతరంస్టాంగ్‌రూమ్‌లో భధ్రపరచాల న్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సిసి కెమేరాల ఏర్పాట్లు చేయాలన్నారు. మార్చి 3వ తేదీన నిర్వహించే కౌంటింగ్‌కు సంబంధించి సూపర్ వైజర్లు తదితర ఓట్లలెక్కింపు సిబ్బంది

- తరువాయి 2లో..





## హెల్మెట్ ధారణతో మనతో పాటు

# మరో ఇద్దరికి ప్రమాదాల నివారణ

### - తలకు భారంగా భావించవద్దు - మన కుటుంబానికి భద్రత

**భీమవరం,మేజర్‌న్యూస్:** ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఆవశ్యకతను వివరించి, ప్రతి ఒక్కరూ తప్పక హెల్మెట్ ధరించి ప్రయాణాలు చేయాలని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి,జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి సంయుక్తంగా కోరారు. గురువారం స్థానిక కొత్త బస్టాండు యస్ జెజియం ఉన్నత పాఠశాల వద్ద 36వ జాతీయ రహదారి భధ్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జరిగిన హెల్మెట్ ర్యాలీని జిల్లా కలెక్టరు జెండా ఊపి ప్రారంభించి, హెల్మెట్లు ధరించి జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ద్విచక్ర వాహనాలను స్వయంగా నడుపుతూ ర్యాలీలో పాల్గొన్నారు. జువ్వలపాలెం రోడ్డు శ్రీ అల్లూరి సీతారామరాజు స్మృతి వనం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరాలని,ఇంటిదగ్గర మీకోసం తల్లితండ్రులు,భార్య, పిల్లలు ఎదురు చూస్తారని జిల్లా కలెక్టరు హితవు పలికారు. మన జిల్లాలో మోటారు సైకిల్ మీద ముగ్గురు ప్రయాణాలు చేస్తున్నారని,ఇది చాలా బాధాకరం అన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడుపుతున్న వారిని మొదట హెచ్చరికతో వదిలి, హెల్మెట్ ఆవశ్యకతను వివరించాలని, రెండవసారి కూడ హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఖచ్చితంగా మోటారు వాహన చట్టం

- తరువాయి 2లో..

## చట్టసభల్లో బీసీలకు 50 శాతం

# రిజర్వేషన్ల సాధనలో భాగస్వామినవుతా





### - బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు పోరాటానికి మద్దతు
### - ఢిల్లీలో జరిగిన సెమినార్‌లో ఎంపీ పుట్టా మహేష్ వెల్లడి

**ఢిల్లీ /ఏలూరు,మేజర్‌న్యూస్:** చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనలో మిగిలిన ఎంపీలతో కలిసి తాను కూడా భాగస్వామిని అవుతానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడానికి పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో గురువారం జరిగిన సెమినార్‌కు రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్యతో కలిసి ఎంపీ మహేష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తాను బీసీ సామాజిక వర్గంలో పుట్టడాన్ని అదృష్టంగా భావిస్తున్నానని, తాను బీసీని కావడం వల్లే ఈరోజు ఎంపీగా చట్టసభలో

- తరువాయి 2లో..

# నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

### - రూ.72 లక్షల 94వేల విలువైన బంగారం,వెండి స్వాధీనం
### - జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ వెల్లడి



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** రాత్రిపూట గోడకు కన్నం వేసి నగల దుకాణంల్లో బంగారు, వెండి వస్తువుల దొంగతనం నేరం చేసిన నలుగురు అంతర్ రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రూ.72 లక్షల 94వేల విలువైన బంగారం,వెండి స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ వెల్లడించారు. గురువారం ఆయన పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నలుగురు దొంగలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి చోరీ సొత్తు రికవరీ చేసిన విషయం వివరాలు తెలిపారు.ఈ సంవత్సరం జనవరి నెలలో 11-12వ తేదీన ఏలూరు ఒకటవ పోలీసు స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో మెయిన్ బజార్ లోని లోకేశ్వరి జువేలర్స్ వెనకనుండి గోడకు కన్నం వేసి బంగారు, వెండి వస్తువుల చోరీ నేరం జరిగింది. కె.ప్రతాప్ శివ కిషోర్ సూచన మేరకు డి.ఎస్.పి డి.శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో సదరు నేరము చేసినవ్యక్తులజాడ కనుగొనుటకుగాను ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. టీం సభ్యులు అయిన ఏలూరు 1 టౌన్ ఇన్స్పెక్టర్‌జి.సత్యనారాయణ, ఎస్‌బి సిఐ బి.ఆది ప్రసాద్ ,సీసీఎస్,సిఐ రాజశేఖర్, గణపవరం సిఐఎంవి సుభాష్ ,ఎస్ కె.మదీనా

- తరువాయి 2లో..

# 34 శాతం నామినేటెడ్ పోస్టుల పట్ల టీడీపీ బీసీ నేతల హర్షం

**ఆగిరిపల్లి,మేజర్ న్యూస్:** రాష్ట్ర కేబినెట్ సమావేశంలో గురువారం బీసీ లకు నామినేటెడ్ పోస్టుల్లో 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్ ఆమోదించిందుకు నూజివీడు నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షులు, తోటపల్లి గ్రామ సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాసరావు,శోభనాపురం గ్రామ సర్పంచ్ నక్కనబోయిన వేణు హర్షంవ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలముందు జాతీయ బిసి సంక్షేమ సంఘంకి ఇచ్చిన హామీ నెరవేర్చారని, బిసిలకు రక్షణ చట్టం గురించి మంత్రి వర్గం లో చర్చ, చట్టసభల్లో బీసీ లకు 34 శాతం కులగణన గురించి కేంద్రానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు లేఖ రాయడం, మంత్రి వర్గం ఆమోదం తెలపడంచాలా ఆనందం కల్గించ్చాయని అన్నారు. ఈ నిర్ణయంతో బడుగు,బలహీన వర్గాల అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం బీసీ లకు బలంగా మంచి చేస్తున్నారని, ప్రజలలో పూర్తిగా విశ్వాసం ఉందని తెలిపారు.ఈ సమావేశంలో పలువురుటీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు





## నలుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

మొదటిపేజి తరువాయి

బాషా , ఎస్ ఐ ఎం .సూర్య భగవాన్ ,పోలీస్ కానిస్టేబుల్ ఆర్ మోహన్ కృష్ణ, బి.నాగార్జున, నాగరాజు దర్యాప్తు చేపట్టగా,దర్యాప్తులో భాగంగా గురువారం ఉదయం 6 గంటల సమయంలో అరెస్టు చేశారు.ఏలూరు పట్టణం, చోడిమెల్లరోడ్డు చింతలపూడి రోడ్డు ప్రక్కనగల, లే అవుట్ సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకుని వారిని విచారించగా వారు 2025 జనవరి నెలలో 11-12 వ తేదీ ఏలూరు 1వ పట్టణ పోలీసు స్టేషన్ పరిధి లోని అర్ధరాత్రి సుమారు 12 గంటల సమయంలో మెయిన్ బజార్ లోని లోకేశ్వరి జువెలర్స్ వెనకనుండి గోడకు కన్నం వేసి బంగారు, వెండి వస్తువుల చోరీ గురించి వివరాలు తెలిపారు. వారి వద్ద నుండి చోరీ చేసిన బంగారు, వెండి వస్తువులు చోరీ చేయడానికి ఉపయోగించిన పనిముట్లు, మోటార్ సైకిల్ ను రికవరీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. - ముద్దాయిల వివరాలు - కుల్దీప్ శర్మ , బిదౌలి గ్రామం, జగ్నేర్ తహసిల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం,మనోజ్ కుమార్ ఆగ్రా జిల్లా,ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం, మహేందర్ సింగ్ అజీజ్‌పూర్ గ్రామం. ఆగ్రా జిల్లా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, రాజేష్ కుసువాహ ఆగ్రా జిల్లా,ఉత్తర్ ప్రదేశ్ రాష్ట్రం రిమాండ్ నిమిత్తం కోర్టులో ప్రవేశ పెట్టి, రిమాండ్ కు పంపడం జరుగుతుందని ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ తెలిపారు.

## ముత్త పెద్దకాపును పరామర్శించిన జగ్గంపేట జనసేన ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్

**కిర్లంపూడి, మేజర్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండలం కిర్లంపూడి గ్రామానికి చెందిన ముత్త పెద్దకాపు కుమారుడు ముత్తా దుర్గ ఇటీవల స్వర్గస్తులు అయినారు. గురువారం వారి దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి జగ్గంపేట జనసేన ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్లపు దొరబాబు, గంధం ప్రభాకర్, చదలవాడ బాబీ,పాముల వీరబాబు, పెంటకోట నాగు బాబు,పాముల చంటి,చీకాల భగవాన్,నాగబోయిన శివ ఇతరులు పాల్గొన్నారు.

## ప్రతి గ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలి

**- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి**

**- జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ లేకుండా హేతుబద్ధతతో కూడిన విధానంలో ప్రతి గ్రామంలో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉదయం కొవ్వూరు డివిజన్, మధ్యాహ్నం రాజమండ్రి విద్యా శాఖ సమీక్షలో భాగంగా మండల పాఠశాల విద్యా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, మండల అభివృద్ధి అధికారులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించి విద్య కోసం ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ డేటా, ఫిజికల్ వెరిఫికేషన్ డేటా ఆధారంగా విద్యార్థి వారీగా డేటా ను అనాలసిస్ చెయ్యాలన్నారు. ఏ ఒక్క విద్యార్థి డ్రాప్ అవుట్ కాకుండా చర్యలు తీసుకోవడం లో గ్రామ స్థాయిలో అంగన్వాడీ కేంద్రాలతో ఫౌండేషన్ స్కూల్స్ అనుసంధానం చేయడం వల్ల అప్ గ్రేడ్ చేయడం, తద్వారా అదనపు బోధన సిబ్బంది అందుబాటులోకి రావడం సాధ్యం అవుతుందని తెలిపారు. ప్రతి గ్రామంలో ఒక మోడల్ ప్రైమరీ పబ్లిక్ స్కూల్ ప్రతిపాదన అమలు చేయాలని, ఇందుకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విద్యార్థులు సంఖ్య ఆధారంగా చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఎం వి ఈ వో పాఠశాల సందర్శన చెయ్యాలని, ఎంపీడీవో , మండల ప్రత్యేక అధికారులు కూడా డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల ఇండ్లకు వెళ్లి అవగాహన కల్పించి, స్కూల్ కు వచ్చేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యా అధికారి కే. వాసుదేవ రావు, ఎస్ ఎస్ ఏ పి డి ఎస్ సుభాషిణి, ఉదయం కొవ్వూరు, మధ్యాహ్నం రాజమండ్రి డివిజన్ కు చెందిన మండల స్పెషల్ ఆఫీసర్ లు, మండల పాఠశాల విద్యా అధికారులు, ఎంపీడీవో లు, తదితరులు పాల్గొన్నారు.

# యూరాలజీ సమస్యలపై అవగాహన సదస్సు

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్( ది పి.ఎం.పి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) కాకినాడ జిల్లా జగ్గంపేట గండేపల్లి మండలాల ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు నూరుద్దీన్ బాషా అధ్యక్షత న గురువారం జగ్గంపేట ఎమ్మార్వో ఆఫీస్ వెనుక షాదీఖానాలో కాకినాడ వారి మౌర్య హాస్పిటల్ ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ పుల్ల ప్రసాద్ ఎంబిబిఎస్ ఎం ఎస్ ఎం సి హెచ్ యూరాలజీ సమస్యలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జగ్గంపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ వై ఆర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ రెండు మండలాల పీఎంపీ సభ్యులు ప్రాథమిక వైద్యము చేసుకోవాలని, గ్రామాల్లో ఎంతమంది సభ్యులు ఉన్నారు, ఒక్కొక్క గ్రామానికి ఎంతమంది ఉన్నారు, వాళ్ళు ఏ సంఘంలో ఉన్నారు అని ఆరా తీసారు. ప్రతి పీఎంపీ ప్రతి సంవత్సరం సంఘానికి రెన్యువల్స్ కట్టుకొని సంఘానికి కట్టుబడి అందరూ ఒక కుటుంబ సభ్యులుగా ఉండాలని సూచించారు. మీ పరిధిలో ప్రాథమిక వైద్యం చేసుకొని రోడ్డుమీద యాక్సిడెంట్లు అయినటువంటి కేసులు ఏమైనా ఉంటే ఫస్ట్ ఎయిడ్ చేయవలెనని అన్నారు. మీ రెండు మండలాల్లో 50 మంది సభ్యులు ఉన్నట్టు తెలిసినదే కానీ ఈ రోజున 30 మంది వచ్చారు. మిగతా సభ్యులు కూడా వచ్చి ప్రతినెల మీ మీటింగ్లకు హాజరుకావాలని అలాగే



గ్రామాల్లో ఉన్న పీఎంపీ సభ్యులు రెన్యూవల్స్ పూర్తిచేసుకుని మీ పేర్లు బయోడేటా అంతా నాకు 15 రోజుల్లో అందజేయవలెనని తెలిపారు. అలాగే ప్రతి సభ్యుడు పోస్టుఆఫీస్ లో జీవిత బీమా చెల్లిస్తే 10 లక్షల బీమా మీ కుటుంబీకులకు ఆసరా ఉంటుందని అలాగే ప్రతి మీటింగ్ కి ఒక క్వాలిఫైడ్ డాక్టర్ గారిని తప్పించుకొని వారి దగ్గర ట్రైనింగ్ తీసుకుని కొత్త కొత్త విషయాలు కొత్త కొత్త మందులు ఏమైనా ఉంటే తెలుసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఐ రఘునందన్,సభ్యులు నాగరాజు, రమణ, సుబ్బారావు, ఎస్కే వలీషా, ఎ సత్యనారాయణ, వీవీఎస్ మూర్తి, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

మొదటిపేజి తరువాయి

నియామకాలను పూర్తిచేసుకోవాలన్నారు. వీరికి అవసరమైన శిక్షణను ఈనెల 17న అందించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్ సెంటర్ లో అవసరమైన వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఓ, డిసిహెచ్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా కృష్ణ – గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల సంబంధించి ఏర్పాట్లు కూడా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 13వతేదీన నామినేషన్ల కు ఉపసంహరణకు గడువు, 27న ఉదయం 8 గం. నుండి సాయంత్రం 4 గం.వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మార్చి 3వ తేదీన ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్ఓ వి.విశ్వేశ్వరరావు, జెడ్పి సిఇఓ కె.సుబ్బారావు,డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు,ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్ రాజు,ఏలూరు ఆర్డిఓ అచ్యుత అంబరీష్, డిఎస్పీ శ్రావణ్ కుమార్,డిటిసి కె.ఎం.ఎస్.వి. కృష్ణారావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజరు వి.శ్రీలక్ష్మి, జిల్లా అగ్నిమాపక అధికారి సిహెచ్ రత్నబాబు, ఎల్డిఎం డి. నీలాద్రి మున్సిపల్ కమీషనరు ఎ. భానుప్రతాప్, డిఎంహెచ్ఓ డా.ఆర్. మాలతి, తహశీల్దారు జి.వి. శేషగిరి, కలెక్టరేట్ ఏవో నాంచారయ్య, తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధారణతో మనతో పాటు మరో ఇద్దరికి ప్రమాదాల నివారణ

మొదటిపేజి తరువాయి

177 సెక్షన్ ప్రకారం వెయ్యి రూపాయలకు పైగా అపరాధ రుసుం విధించబడుతుందని జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో జనవరి 16 వ తేదీ నుండి జిల్లాలో ప్రతి రోజూ అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం మంచి శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఎస్పి వి.భీమారావు,జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు,డిఎస్పీ ఆర్.జి.జయసూర్య, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు కె.యస్.యన్.ప్రసాదు, సి.హెచ్.వి.రమణ, యం.రవికుమార్, యన్.యల్.యస్.లక్ష్మి,డి.సత్యనాణ, పాఠశాల ప్రధానో పాధ్యాయులు డి.ఇ.ఇ. దానం, విజ్ఞాన వేదిక కన్వీనరు చెరుకువాడ రంగసాయి,స్వచ్ఛంద సేవకులు అల్లు శ్రీనివాసు, ఆటో యూనియన్ ప్రెసిడెంటు ఇంటి సత్యనారాయణ, రవాణా శాఖ, పోలీసు, వివిధ శాఖల సిబ్బంది,పట్టణ విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ల సాధనలో భాగస్వామినవుతా

మొదటిపేజి తరువాయి

అడుగుపెట్టే అవకాశం లభించిందని తెలిపారు. తన కుటుంబం ఎంతో కష్టపడి ఈరోజు ఆర్థికంగా పైకి వచ్చిందని, తద్వారానే తనకు ఎంపీగా పోటీ చేసే వీలు కలిగిందని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో తమ కుటుంబానికి ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించాలనే ఆలోచనతో తనకు ఎంపీగా పోటీ చేసే అవకాశం కల్పించాలని తెలిపారు. రాజకీయాల గురించి పెద్దగా తెలియకపోయినా, తెలుసుకొని సార్వత్రిక ఎన్నికలకు 45 రోజుల ముందు రాజకీయాల్లోకి అడుగుపెట్టిన తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించిన ఏలూరు జిల్లా ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎంపీ తెలిపారు. బీసీ సామాజిక వర్గానికి చెందినవారు ప్రతి ఒక్కరూ ఒకటే అర్థం చేసుకోవాలని, ఈరోజు తమ పిల్లలను బాగా చదివిస్తేనే ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉందని సూచించారు. చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ల సాధన, బీసీ కులగణనకు, ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు తన పూర్తి మద్దతు ఎప్పుడు ఉంటుందని ఎంపీ హామీ ఇచ్చారు.

# నియోజకవర్గాలవారీగా పీ4 ప్రణాళికలు

**– సీఎస్‌కి తెలియజేసిన జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి**



**ఏలూరు,మేజర్ న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలతో సామాజిక, ఆర్థిక సాధికారత, స్థిరమైన అభివృద్ధిని సాధించే దిశలో భాగంగా జిల్లాలో పీ4 (పీపుల్, పబ్లిక్, ప్రైవేట్ పార్టిసిపేషన్) కార్యక్రమానికి సంబంధించి నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను నిర్దేశించిన సమయంలోగా రూపొందిస్తామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ కు తెలియజేసారు. "స్వర్ణాంధ్రప్రదేశ్ 2047" లక్ష్యసాధనలో భాగంగా పది సూత్రాలతో పీ4 ప్రణాళికల రూపకల్పనపై సెక్రటేరియట్ నుండి గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ పీ4 (పీపుల్ ,పబ్లిక్, ప్రైవేట్,పార్టిసిపేషన్) కార్యక్రమాన్నీ రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది రోజున ప్రారంభిస్తారని, ఇందుకు సంబంధించి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించి నిర్దేశించిన సమయంలోగా పంపాలని కలెక్టర్లను కోరారు. ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో నోడల్ అధికారులను నియమించాలని,నోడల్ అధికారితోపాటు 6 గురు సభ్యులతో బృందాలను ఏర్పాటుచేసి,ప్రజల అభిప్రాయాలను సేకరించాలన్నారు. ఎం ఎస్ ఎంఈ సర్వేని వేగవంతం చేయాలనీ,సీఎస్ కలెక్టర్లను కోరారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులతో మాట్లాడుతూ పేదరికాన్ని సమాజం నుండి తరిమివేసి ప్రజల జీవన ప్రమాణాల స్థాయిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుండి అమలు చేసే పీ4 ప్రణాళికను నిమిత్తం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ప్రణాళికలను నిర్దేశించిన సమయంలోగా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కమీషనర్ భానుప్రతాప్ జిల్లా పరిషత్ సీఈఓ కె.సుబ్బారావు,డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ అధికారి విజయరాజు, జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ భాషా, సిపిఒ సిహెచ్. వాసుదేవరావు, జిల్లా పంచాయతీ అధికారి అనురాధ, డీఈఓ వెంకట లక్ష్మమ్మ ప్రభృతులు పాల్గొన్నారు.

# 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం ఫిబ్రవరి 10వ తేదీన సందర్భంగా గురువారం స్థానిక డిఎంహెచ్‌ఓ కార్యాలయంలో నులిపురుగుల నివారణ, ఆల్బెండజోల్ మాత్రలు అవశ్యకతకు సంబంధించి ప్రచార వీడియోలు,కరపత్రములు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి ఆర్.మాలతి ఆవిష్కరించారు. అలాగే 1 నుంచి 19 సంవత్సరాలు గల ప్రతి ఒక్కరికీ ఈ మాత్రలు పంపిణీ చేయవలసిందిగా ఆదేశించారు. ఈ నెల 10వ తేదీన,ఎవరైనా మాత్రలు వేసుకోనిపక్షంలో వారితో ఫిబ్రవరి 17వ తేది మాప్ అప్ డే రోజు వారిచేత మింగించవలిసిందిగా ఆదేశించారు. ఈ ప్రోగ్రామ్ నూరుశాతం విజయవంతం చేయడానికి విద్య ,అంగన్వాడీ,సంబంధిత లైన్ డిపార్ట్మెంట్స్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ బిఎస్ కె జిల్లా ప్రోగ్రాం అధికారి డా కె.నరేంద్ర కృష్ణ, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డా.రాజీవ్, డా.భార్గవి,ఆర్ బి ఎస్ కె జిల్లా ప్రోగ్రాం మేనేజర్ నరేష్,బొప్పన పాల్గొన్నారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి వీర రాఘవులు నామినేషన్





**– ఉపాధ్యాయ,ఉద్యోగ,కార్మిక, ప్రజాసంఘాల భారీ ర్యాలీ**

**– పాల్గొన్న శాసన మండలి సభ్యులు లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వర్లు ,గోపి మూర్తి**

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాలు బలపరిచిన ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పి.డి.ఎఫ్) అభ్యర్థిగా దిడ్ల వీర రాఘవులు (డి.వి.రాఘవులు) నామినేషన్ కార్యక్రమం భారీ ర్యాలీతో అట్టహాసంగా జరిగింది. ఏలూరు,పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలు మరియు రంపచోడవరం రెవెన్యూ డివిజన్ నుండి వందలాది మంది ఉద్యోగులు,ఉపాధ్యాయులు, పట్టభద్రులు, కార్మిక ,ప్రజాసంఘాల నుండి తరలివచ్చారు. స్థానిక సిఐటియు కార్యాలయం నుండి ఫైర్ స్టేషన్ మీదుగా జిల్లా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్‌లో అభ్యర్థి డివి రాఘవులు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం సిఐటియూ కార్యాలయం వద్ద బహిరంగ సభ నిర్వహించారు.ఈ బహిరంగ సభకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. సుభాషిణి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన శాసనమండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, కృష్ణా,గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే శక్తి పిడిఎఫ్ అభ్యర్థులకు మాత్రమే ఉందని చెప్పారు. స్వలాభం కోసం కాకుండా ప్రజా సంక్షేమం కోసం పాటుపడే అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. డివి రాఘవులు గత 40 సంవత్సరాలుగా యుటిఎఫ్‌లో వివిధ స్థాయిలలో పనిచేసి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాలకు నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పాలకుల తప్పుడు విధానాలు ప్రశ్నించి ప్రజా సమస్యలను లేవనెత్తి పరిష్కారం కోసం కృషి చేసే డివి రాఘవులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పాలకులు పట్టించుకోవడంలేదని అన్నారు. ప్రతిపక్ష పాత్ర పోషిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్, సిఐటియు, రైతు,వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు వి.ఉమా మహేశ్వరరావు, మంతెన సీతారాం, బి.బలరాం,కె.ఉమామహేశ్వరరావు పి.చంద్రశేఖర్,ఎస్ బాలాజీ,జ్యోతి బసు,శ్రీదేవి, అరుణ కుమారి,రవికుమార్, ముస్తఫ్అలీ,విజయరామరాజు, రామభద్రం,జయకర్,షరీఫ్,నరేష్,డిఎన్‌విడి ప్రసాద్, ఎ.రవి,ఎస్.ఎన్ రమేష్,జి రవి కిషోర్,బేబీ రాణి,జెఎన్వి గోపాలన్, అరుణ్ కుమార్,ఐ.వి సుధాకర్,కె.రాజా రామ్మోహన్ రాయ్, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

# ముంపు ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర విపత్తు నివారణ బృందం



**వేలేరుపాడు, మేజర్ న్యూస్ :** గోదావరి వరదలకు ముంపు కు గురవుతున్న గ్రామాల తీరు తెన్నులను క్షుణ్ణంగా పరిశీలించి నివేదిక రూపందించేందుకు కేంద్ర బృందం గురువారం ముంపు ప్రాంతాల్లో పర్యటించి అధ్యయనం చేపట్టారు. గోదావరి వరద సమయంలో ఏ ఏ గ్రామాల్లోకి నీళ్లు చేరుతుంది, వరద బాధితులకు ఎటువంటి సహాయ సహకారాలు అందజేస్తున్నారని మండల అధికారులను అడిగి తెలుసుకున్నారు.కాన్సెరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీస్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ స్వాతి సులగ్న, డిప్యూటీ డైరెక్టర్ జెస్సీ ఆనంద్ లు మండల పర్యటన చేశారు.తహసీల్దార్ డివి సత్య నారాయణ ముంపు గ్రామాల వివరాలు,పునరావాస కేంద్రాల్లో ఇప్పటి వరకు చేపట్టిన సహాయక చర్యల గురించి కేంద్ర బృందానికి వివరించారు. 2022 సం.లో వచ్చిన గోదావరి వరదలకు భారీ ఆస్తి నష్టం వాటిల్లిందని ముంపు ప్రాంతాల గ్రామస్తులు తెలియజేసారు.పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన ప్రతీ సంవత్సరం రెండేసి దఫాలు వరద తమ గ్రామాలు చుట్టు ముట్టి ఇళ్ళలోకి నీరు చేరుతోందని విన్నవించారు.భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక తోనే రహదారులు అన్నీ జలమయం అవుతున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్డిఏ కూటమి నాయకులు గణేషుల ఆదినారాయణ, బుడిపిటి సురేష్,యాళ్ల శంకర్, ఎండీ నయాం,మోహన్ దొర,నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ జనరల్ ప్రయోగ పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల

**ఏలూరు,మేజర్ న్యూస్:** ఈ నెల 10వ తేదీ నుంచి ప్రారంభమగు జనరల్ ప్రయోగ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్ విడుదల చేయడం జరిగింది. ఈ క్రింది తెలిపినటువంటి ఇంటర్మీడియట్ బోర్డు వారు విద్యార్థులు హాల్ టికెట్ నెంబర్‌ను,విద్యార్థి పుట్టిన తేదీ వివరాలు ఇచ్చి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు అవకాశం కల్పించబడింది. %వ్జీజూం://ఎఱఐ.ఖజూ.వ్రశీజ.ఱఅ అదే విధంగా విద్యార్థి చదువుతున్న కళాశాలలో ఈ జనరల్ ప్రయోగ పరీక్షలను తీసుకోవచ్చు,కావున రెండవ సంవత్సరం సైన్స్ గ్రూప్‌లో చదువుతున్న విద్యార్థులందరూ వారి ప్రయోగ పరీక్షలకుసంబంధించి హాల్‌టికెట్ తీసుకోవలసిందిగా సూచించారు.

# 10న కలెక్టరేట్‌కు తరలి రండి

**– సిపిఐ ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ**



**ఏలూరు,మేజర్‌న్యూస్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ),ఏలూరు 27వ డివిజన్ నందు ఏరియా సమితి సభ్యులు బి.కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని అర్జీల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ ఏలూరు ఏరియా కార్యవర్గ సభ్యురాలు మావూరి విజయ మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పేద ప్రజలకు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలను పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అర్జీల నమోదు కార్యక్రమం చేపట్టిందని అందులో భాగంగా ఫిబ్రవరి 10వ తేదీన ఏలూరు జిల్లా కలెక్టర్‌కి అర్జీలు అందించే కార్యక్రమంలో అర్జీదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత పదకొండు రోజులుగా ఏలూరు నగరంలోని వివిధ డివిజన్లలో అర్జీలు నమోదు కార్యక్రమం ఏరియా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏరియా సమితి నాయకులు గొర్లి స్వాతి,బి.శ్రీదేవి, ఆలూరి రమేష్,పాల్గొన్నారు.

# కూటమి నిబద్ధత వైపే పట్టభద్రులంతా మొగ్గు చూపాలి

**- ఎమ్మెల్యే బడేటి చంటి,పరిశీలకురాలు సునీత**



**ఏలూరు,మేజర్‌న్యూస్ :** కూటమి నిబద్ధత వైపేపట్టభద్రులంతా మొగ్గుచూపాలని తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలఅసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకురాలు ఆచంట సునీత,ఎమ్మెల్యే బడేటి చంటి కోరారు. అసెంబ్లీ నియోజకవర్గంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారపర్వం జోరందుకుంది. దీనిలో భాగంగా కూటమి తరపున పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరం గెలుపును కాంక్షిస్తూ గురువారం స్థానిక 28వ డివిజన్‌లో కూటమి పార్టీల నాయకులు,కార్యకర్తలతో కలిసి ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. డివిజన్‌లోని ఇంటింటికీ తిరిగిన వారు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ, రానున్న రోజుల్లో చేయనున్న మంచిని తెలియజేస్తూ,, కూటమి అభ్యర్థి పేరాబత్తులకు పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యతా ఓటును వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పరిశీలకురాలు ఆచంట సునీత మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వాధినేతలు చేస్తోన్న కృషిని,మంచిని ప్రతిఒక్కరు గుర్తిస్తు న్నారన్నారు. విద్యావంతులంతా ముక్తకంఠంతో కూటమి ప్రభుత్వానికి జై కొట్టారని, అదేవిధంగా ఈ నెల 27వ తేదీన జరిగే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులంతా మరోసారి తమ అమూల్యమైన ఓటును కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా క్రమంలో వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ అరాచకాలకు స్వస్తి పలికిన ప్రజలు, విద్యావంతులంతా కలిసి సామాన్యులకు అండగా ఉండే కూటమి ప్రభుత్వానికి మరింత మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ విప్ తంగిరాల అరుణ, కో – ఆప్షన్ సభ్యులు చోడో వెంకటరత్నం, ఎస్సెమ్మార్ పెదబాబు, పార్టీ పరిశీలకులు షేక్ మీరా, టిడిపి నగరాధ్యక్షులు పెద్దిబోయిన శివప్రసాద్, కార్యదర్శి రెడ్డి నాగరాజు, నాయకులు తంగిరాల సురేష్, ఆర్నేపల్లి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# పొరపాట్లకు తావులేకుండా జరుగుతున్న రీ సర్వే

**- జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి**

**పెదవేగి,మేజర్ న్యూస్ :** సమస్యలకు తావులేని రీతిలో రీ సర్వే చేస్తున్నామని జిల్లా జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి చెప్పారు. రీ సర్వేలో ఏమైనా సమస్యలు ఉంటే తెలియ పర్చాలని ఆమె రైతులకు సూచించారు. పెదవేగి మండలం కవ్వగుంటలో జరుగుతున్న రీ సర్వే పనులను జెసి ధాత్రి రెడ్డి గురువారం సాయంత్రం పరిశీలించారు. ఇప్పటివరకు చేసిన సర్వేను పరిశీలించిన ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవ్వగుంటలో 1100 ఎకరాల విస్తీర్ణం ఉందని,గ్రామం యూనిట్గా 250 ఎకరాలు విస్తీర్ణంతో 6 బ్లాక్సుగా విభజించామని, ఒక్కో బ్లాక్ కు ఒక బృందాన్ని ఏర్పాటు చేసి రీ సర్వే పనులు నిర్వహిస్తున్నామని,ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చర్యలు రీ సర్వే పనులు జరుగుతున్నాయని ఆమె వివరించారు. సర్వే జరిగే సమయంలో రైతులు తమ భూమి హక్కులు మారకుండా దగ్గరుండి చూసుకోవాలని,ఏవైనా సమస్యలు ఉంటే అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉందని ఆమె స్పష్టం చేశారు. కొంతమంది రైతులు అందుబాటులో ఉండడం లేదని,అలాంటి వారికి సమాచారం తెలియపరచడానికి అనువుగా వాట్సప్ గ్రూపులను కూడా ఏర్పాటు చేసి సమాచారాన్ని



ఎప్పటికప్పుడు తెలియపరుస్తున్నామని ఆమె తెలిపారు. సర్వే జరిగిన వెంటనే ఆ సమాచారాన్ని వాట్సప్ గ్రూపు ద్వారా సంబంధిత రైతులకు అందే విధంగా చర్యలు తీసుకున్నామని జెసి ధాత్రి రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ రికార్డ్స్ ఏడి ఎండి అన్సారి,డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే టిబిఎస్వి.రమణ రావు, పెదవేగి తాసిల్దారు ఎస్ఎ్.భ్రమరాంబ, రీసర్వే డిటి రామారావు,పెదవేగి మండల సర్వేయర్ పీవీవీకే ఎస్.మూర్తి,ఆర్ఐ కెవి.సారథి, రీ సర్వే సర్వేయర్లు,గ్రామ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

# సన్న,చిన్న, కౌలు రైతుల ఋణాలకు సహకారం





**- మంజూరుకు సహకార సంఘాలు కృషి చేయాలి : జిల్లా కలెక్టర్**

**భీమవరం,మేజర్‌న్యూస్:**జిల్లా కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాల్లో కార్యాలయ 19 శాఖల అధికారులతో గురువారం 4వ పశ్చిమగోదావరి జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి సంయుక్తంగా పాల్గొన్నారు.జిల్లాలో 688 సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో 667 సంఘాలు పనిచేస్తున్నాయని, వీటిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి (పిఏసిఎస్) సంఘాలు 122 ఉన్నాయని, వీటిలో 121 సంఘాలకు కంప్యూటరీకరణ తుదిదశలో ఉందని,ఈ నెల 15వ తేదీలోగా పూర్తి చేస్తామని, అజెండా అంశాలను జిల్లా సహకార అధికారి యం.నాగరాజు, జిల్లా కలెక్టరుకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ కో– ఆపరేటివ్ కమీషనరు,రిజిస్ట్రారు ఆఫ్ కో–ఆపరేటివ్ సొసైటీస్ ద్వారా జిల్లాలో లక్ష్య కార్యక్రమాలు అమలు కోసం వార్షిక ప్రణాళికను సిద్ధం చెయ్యాలన్నారు. జనవరి నెలలో వార్షిక ప్రణాళికపై చర్చ,ఫిబ్రవరిలో డిజిటలైజేషన్ కౌలు రైతులకు రుణాలు, మార్చిలో స్టూడెంట్సు అవగాహన కార్యక్రమాలు, ఏప్రిల్ నెలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు, డ్వాక్రా సంఘాలతో సమావేశాలు, మే నెలలో ప్యాక్స్ సొసైటీ శిక్షణ కార్యక్రమాలు, జూన్ నెలలో చేనేత సహకార సంఘాలకు,జూలైలో మత్స్య సహకార సంఘాలకు, ఆగస్టు నెలలో జిల్లా కో–పరేటివ్ సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక చేకూర్పు, సెప్టెంబరులో యువతకు అవగాహన కార్యక్రమాలు, అక్టోబరు నెలలో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యక్రమాలు, నవంబరు నెలలో సర్వీసు ప్రొవైడరు బ్యాంకింగు, క్రెడిట్ సొసైటీ సెమినార్, డిసెంబరు నెలలో డిసిసిబి ఆధ్వర్యంలో సహకార సంఘాలకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింటు కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఉభయ జిల్లాల డిసిసిబి జనరల్ మేనేజరు ఏ.మాధవి, జిల్లా సహకార అధికారి యం.నాగరాజు,సివిల్ సప్లై జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు,డియస్‌వో యన్.సరోజ, జిల్లా పంచాయతీ అధికారి బి.అరుణశ్రీ, జిల్లా పశుసంవర్ధకశాఖఅధికారి డా.కె.మురళీ కృష్ణ,జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.వి.యస్.వి. ప్రసాదు, మార్కెటింగు సహాయ ఇంజనీరు యం.శ్రీనివాసు, సహాయ రిజిస్ట్రారు టి.యస్.వి.యస్. హనుమంత రావు, జిల్లా వ్యవసాయ శాఖ టెక్నికల్ అధికారి పి.రమేష్ నాయుదు, సంబంధిత వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్వేదిలో జాతీయ సమైక్యతా శిబిరం



**నర్సాపురం,మేజర్ న్యూస్:** స్థానిక శ్రీ వైఎన్ కళాశాలలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్,ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ సమైక్యత శిబిరంలో 4వ రోజు గురువారం అంతర్వేది పర్యటన చేశారు. ఈ పర్యటనలో భాగంగా అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాన్ని సందర్శించి, దేవాలయ ప్రాశస్త్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం వశిష్ఠ ఆశ్రమాన్ని సందర్శించి, ప్రసాద రాజు గురూజీ 'అందరితో కలిసి మాట్లాడండి అందరూ కలిసి బోధించండి' అనే అంశం మీద ప్రవచనాలు చెప్పారు. వేద శాస్త్రంలోని ప్రముఖ అంశాలు, చతుర్వేద భాష్యకారిక అంశాలు మొదలగు వాటిని బోధించగా,వాటిపై వచ్చిన సందేహాలను కొంతమంది విద్యార్థులు అడుగగా,సందేహ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు చింతా సోమేశ్వరి, ఎస్. యాకోబు, ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్ రామకృష్ణ, యూత్ ఆఫీసర్ సైదా నాయక్,కోశాధికారి సంజయ్, అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## శని,ఆదివారాల్లో పట్టభద్రుల నామినేషన్లు స్వీకరించబడవు

**ఏలూరు,మేజర్ న్యూస్:** తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంనకు సంబంధించి ఎన్నికల కమీషన్ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 3వ తేదీ నుండి 10 సెలవు దినాలు మినహాయించి నామినేషన్లు స్వీకరించబడును. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్ 1881 ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వులు నెం.4/ఈసిఐ/1–ఈటి, ఎఫ్‌యుఎన్‌సి, జెయుడి, ఎస్‌డిఆర్, వోఎన్ 2016, అనుసరించి, 8 రెండవ శనివారం,9ఆదివారం తేదిలలో తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లా పట్టభద్రుల నియోజకవర్గంనకు సంబంధించి నామినేషన్లు స్వీకరించబడవని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి,ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు.

## వేరుశనగ పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు



నర్సాపురం రూరల్,మేజర్ న్యూస్ : మండలంలోని తూర్పు తాళ్ల గ్రామంలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను కృషి విజ్ఞాన కేంద్రం ఉండి కోఆర్డినేటర్ డాక్టర్ మల్లికార్జునరావు,శాస్త్రవేత్త డాక్టర్ వినయ్ లక్ష్మీ గురువారం పరిశీలించారు. వీరితోపాటు ఏడిఏ అనిల్ కుమారి,ఏఈఓ లక్ష్మీనారాయణ, వి.హెచ్.ఎ జీవన్ హాజరయ్యారు. వేరుశనగ పంటలో తుప్పు తెగులు,ఆకు మచ్చ తెగులు,ఉన్నట్లుగా శాస్త్రవేత్తలు గుర్తించారు. నష్టపరిమితి దాటినప్పుడు తెగులు ఆశించిన వెంటనే కార్బండిజం 12శాతం మాంకోజబ్ 63శాతం ఎకరానికి 300 గ్రాములు పిచికారి చేసి నివారించుకోవచ్చునని రైతులకు సూచించారు. లద్దెపురుగులు నివారణకు క్లోరిఫైరిఫాస్ 20 ఈసీ 2.5 యమ్ యల్,నీటికి లేదా క్వినాల్ఫాస్ 2.5 యమ్ యల్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చని సూచించారు. వేరుశనగ వేయుటకు కెవికె ఉండి కేంద్రం నుండి 25 క్వింటాళ్లు వశిష్ట రకాన్ని 25 మంది రైతులకు రాష్ట్ర మరుటేరు వారు 30 క్వింటాళ్లు విత్తనాలు 30 మంది రైతులకు ఉచితంగా (ఫ్రంట్ లైన్ డిమోనిస్ట్రేషన్) నిర్వహించడానికి ఇచ్చారు. వేరుశనగ పంట వేసిన వారు తమ రైతు సేవ కేంద్రం పరిధిలోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఈ పంట నమోదు ఈకేవైసీ చేయించు కోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు ఈ అనిల్ కుమారి సూచించారు.

# కులాల కుంపటి రాజేస్తున్న పివి సునీల్ కుమార్

**– ఇప్పటికైనా ఈ పోలీసు అధికారిని తక్షణమే సస్పెండ్ చేయాలి**



**ఉండి,మేజర్ న్యూస్:** పోలీసు వాహనంలో వచ్చి ఆకివీడు మున్సిపల్ కార్యాలయంలో రౌడీయిజం చేసింది ఆయన అనుచరులే ఆ వాహనం కూడా సునీల్ కుమార్ పుత్రుల వ్యాపార భాగస్వామి జోగారావు పేరిటే ఉందని ఎమ్మెల్యేగా,శాసనసభ ఉపసభాపతిగా నేను ఈ వ్యాఖ్యలు చేయడం లేదు. సునీల్ కుమార్ పెట్టిన రాజద్రోహం కేసులో ఎ1 బాధితుడిగా ఉన్న కనుమూరి రఘురామకృష్ణం రాజుగా చెబుతున్నా అని అన్నారు. ఐపీఎస్ అధికారి, అంబేద్కర్ మిషన్ సంస్థ వ్యవస్థాపకుడు పీవీ సునీల్ కుమార్ కులాల కుంపట్లను రాజేసి ఆ వేడిలో చలి కాచుకోవాలని ప్రయత్నిస్తున్నాడని ఉండి శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉప శాసనసభాపతి రఘురామకృష్ణంరాజు అన్నారు. కులాల కుంపట్లను రాజేయడానికి వారిని, వీరిని కాకుండా తన కుమారుడి కంపెనీలోని వ్యాపార భాగస్వామిని రంగంలోకి దింపాడని అన్నారు. గతంలో జోగారావు, తులసి బాబు పోలీసు స్టిక్కర్లు అతికించిన కారులోనే ప్రయాణం చేసేవారు. వీరికి పీవీ సునీల్ కుమార్ ఏకంగా పోలీసు శాఖ వాహనాలను కూడా సమకూర్చేవాడు. పోలీసు వాహనాల్లోనే తిరుగుతూ, వీరు దందాలు చేస్తూ, డబ్బులు వసూలు చేసేవారు. బుధవారం నాడు జరిగిన సంఘటన ద్వారా, ఈ విషయం మరోసారి రుజువయిందని రఘురామకృష్ణం రాజు పేర్కొన్నారు. పోలీసు స్టిక్కర్ ఉన్న వాహనంలో వచ్చి ప్రభుత్వ కార్యాలయం పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం కచ్చితంగా చర్యలు తీసుకుంటుందనే తాను భావిస్తున్నట్లుగా రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పోలీస్ శాఖ అచేతనంగా ఉండదని, చర్యలు తీసుకోవడం మాత్రం కాసింత ఆలస్యం అయిన మాట నిజమేనని పేర్కొన్నారు. అయితే దేనికైనా సమయం రావాలని వెల్లడించారు.

– సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకే ఆక్రమణల తొలగింపు –

ఆకివీడు నగర పంచాయతీ పరిధిలోని ధర్మాపురం చెరువు చుట్టూ ఆక్రమణలను తొలగించాలని సర్వోన్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. ఆకివీడు నగర పంచాయతీలోని 30 శాతం మంది ప్రజలకు ధర్మాపురం చెరువు నుంచి మంచినీటి సరఫరా జరుగుతుందని తెలిపారు. చెరువు చుట్టూ ఆక్రమ ణలతో పాటు, చెరువులోకి డ్రైనేజీ, సీవరేజి మురికినీరు కలుస్తోందని చెప్పారు. ఇదే సమస్యను ప్రధానంగా ప్రస్తావిస్తూ పత్రికల్లోనూ, మీడియా లోనూ కథనాలు రావడం జరిగిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం చెరువు చుట్టూ అక్రమణాలను ఎప్పటినుంచో ఖాళీ చేయించాలని ప్రయత్నించినా చేయడం లేదని చెప్పారు. చెరువు చుట్టూ ఆక్రమణలు చేపట్టిన వారికి ప్రత్యామ్నాయంగా ఇతర ప్రాంతాలలో ఇంటి స్థలాలను ఇచ్చి ఖాళీ చేయించాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తూ ఉంటే, కొందరు వ్యక్తులు బుధవారం పోలీసు స్టిక్కర్ ఉన్న వాహనాన్ని ( ఎపి 09 బిఈ 8001) వేసుకొని వచ్చి, మునిసిపల్ ఆఫీసు వద్ద గొడవకు దిగారని తెలిపారు. పోలీసులు వచ్చి మునిసిపల్ ఆఫీసు వద్ద గొడవ చేయటం ఏమిటని, వీళ్లు ఏమి పోలీసులని చెప్పి ఆరా తీయగా, వారంతా పీవీ సునీల్ కుమార్ స్థాపించిన అంబేద్కర్ మిషన్ సంస్థకు చెందిన వ్యక్తులుగా గుర్తించడం జరిగిందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల సర్వీస్ రూల్స్ కు భిన్నంగా పివి సునీల్ కుమార్, అంబేద్కర్ ఇండియా మిషన్ సంస్థ స్థాపించిన విషయాన్ని, గతంలో ఎన్నోసార్లు కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాశానని రఘురామ కృష్ణంరాజు తెలిపారు. పివి సునీల్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# సీసీ కెమెరాలకు 'దేశం' నేత నాయుడు రూ.2లక్షలు సహకారం

**– మరో రూ.2 లక్షలు బులియన్ మర్చంట్ సంఘం వితరణ**



**నర్సాపురం,మేజర్‌న్యూస్ :** అంతర్వేది తిరుణాల సందర్భంగా పట్టణంలో, పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.ఈ కెమెరాలు ఏర్పాటుకు రెండు లక్షల రూపాయలు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు, రెండు లక్షల రూపాయలు బులియన్ మర్చంట్ సంఘం సహకారం అందించింది.ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్పి నయీమ్ అజ్మీ మాట్లాడుతూ గురువారం కెమెరాల ఏర్పాట్లను పరిశీలించారు. అంతర్వేది తిరుణాల సందర్భంగా కట్టుదిట్టమైన ఏర్పాటు చేశామని, అసాంఘిక కార్యక్రమాలు చేసే వారిపై ఒక కన్ను వేశామని సీసీ కెమెరాలు పలుచోట్ల ఏర్పాటు చేశామని ఎస్పీ నయీమ్ అజ్మీ తెలిపారు. అంతర్వేది వెళ్లే పంటిరేవును తనిఖీ చేశారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని పంటిరేవు పాట దారులకు తెలిపారు.లైవ్ జాకెట్లు తప్పనిసరిగా వాడాలని ఎక్కువ ప్రయాణికులను పంటలో ఎక్కించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవిన్యూ,పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట డిఎస్పి శ్రీ వేద, టౌన్ సిఐ యాదగిరి,రూరల్ సిఐ ప్రసాద్, మొగల్తూరు ఎస్సై నాగలక్ష్మి, నర్సాపురం ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# బూత్ స్థాయి నుండి బిజెపి బలోపేతానికి కృషి చేయాలి





**– మండలాధ్యక్షులకు బిజెపి రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ ఆదేశం**

**ఏలూరు,మేజర్ న్యూస్ :** కేంద్ర రాష్ట్ర ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి భారతీయ జనతా పార్టీని పటిష్టం చేయడానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్ జీ అన్నారు. స్థానిక అంబికా ఫ్లేవర్స్‌లో ఏలూరు జిల్లా అధ్యక్షులు సిహెచ్ విక్రమ్ కిషోర్ అధ్యక్షతన బిజెపి జిల్లా పదాధికారులు,నూతనంగా నియమించబడ్డ మండల అధ్యక్షుల సమావేశానికి మధుకర్ జీ ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో పనిచేయాలని పోలింగ్ బూత్ స్థాయి నుండి పార్టీని బలోపేతం చేయటంపై దృష్టి పెట్టాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని మండల అధ్యక్షులకు మధుకర్ జీ సూచించారు. బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గారపాటి సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికమంది సభ్యులు గల చరిత్ర ఉన్న పార్టీ బిజెపి అని,రెండు ఎంపీ సీట్లు నుండి ప్రారంభమై నేడు 19 రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉందని,కేంద్రంలో రాష్ట్రంలోనూ బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని మండల అధ్యక్షులు క్రమశిక్షణతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని గారపాటి చౌదరి పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు నిర్మల కిషోర్, ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ కృష్ణ ప్రసాద్,ఉంగుటూరు నియోజవర్గ కన్వీనర్ శరణాల మాలతీ రాణి, పలువురు జిల్లా పదాధికారులు, నూతనంగా ఎన్నికైన బిజెపి మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

## కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి : టిడిపి నేత థామస్



**చింతలపూడి,మేజర్ న్యూస్:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల శాసన మండలి ఎన్నికలు జరుగునున్న నేపథ్యంలో తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు,కూటమి బలపరిచిన పేరాభత్తుల రాజశేఖర్‌ను మొదటి ప్రాధాన్యత ఓటు ద్వారా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు, రాజీవ్ థామస్ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్ డా.మారుముడి థామస్ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను తీర్చాలన్నా,యువత ఉపాధి అవకాశాలను అందిపుచ్చు కోవాల న్నాకూటమి ప్రభుత్వం వల్లనే సాధ్యమవుతుందని, కనుక మీ పవిత్రమైన ఓటు హక్కు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం మీ చేతిలో ఉందని శాసనమండలిలో పోరాడే యోధుడు రాజశేఖర్‌కు ఓటు వేసి గెలిపించాలని థామస్ కోరారు.

## మొబైల్ ఐసిటిసి ద్వారా ఉచితంగా హెచ్ఐవి పరీక్షలు





ఏలూరు,మేజర్‌న్యూస్: జాతీయ ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమములో బాగంగా గురువారం జిల్లా ఎయిడ్స్ నివారణ,నియంత్రణ సంస్థ ఆద్వర్యంలో స్థానిక వై.ఎస్.ఆర్ కాలనీ ఏలూరు లో సంచార హెచ్.ఐ.వి సలహా,పరీక్ష కేంద్రము (మొబైల్ ఐసిటిసి) ద్వారా ఉచితంగా ప్రజలకు, గర్భిణి స్త్రీలకు, ట్రాన్స్ జెండర్లకు,యువతకు హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందని జిల్లా లెప్రసి, ఎయిడ్స్,క్షయ నియంత్రణ అధికారి డా.ఎమ్. నాగేశ్వర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే హెచ్.ఐ.వి సలహా,పరీక్ష కేంద్రము సేవలను అందుకునేందుకు ప్రజలు స్వచ్ఛంధంగా ముందుకు రావాలన్నారు. అనంతరం ఆ ప్రాంతములో నివసిస్తున్న యువత,ట్రాన్స్ జెండర్లు ముందుకువచ్చి హెచ్.ఐ.వి పరీక్షలు చేయించుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మొబైల్ ఐసిటిసి లో అందించే సేవలను తనిఖీ చేశారు. కార్యక్రమములో పి.బాలాజీ,జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, ఏ.రాజశేఖర్, శిరీష, ఏ. శ్రీనివాస్ ప్రాజెక్టు మేనేజర్, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## నులిపురుగులు నివారణ పై అవగాహన



**నర్సాపురం,మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నివారణ లో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం పురపాలక కార్యాలయంలో నిర్వహించారు.ఈకార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ ఎం అంజయ్య,మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మోహన కారిచర్ల పాల్గొని మాట్లాడుతూ పట్టణంలో ప్రభుత్వ. ప్రైవేట్ అంగన్వాడి సెంటర్ నందు ఈ నులిపురుగుల నివారణ టాబ్లెట్‌లు అందుబాటులో ఉంటాయి అన్నారు. స్కూల్ పిల్లలకు మధ్యాహ్నం భోజనం అయిన తరువాత వేయాలి అన్నారు. 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలుకి ఫుల్ టాబ్లెట్ వేయాలి అన్నారు. ఈకార్యక్రమని సద్వినియోగ పరచుకోవాలి అన్నారు. మాత్రాలను ప్రభుత్వ ఆసుపత్రి ద్వారా సరఫరా చేస్తారన్నారు. ఆశావర్కర్లు సహాయంతోఈ కార్యక్రమం జయప్రదం చెయ్యాలి అన్నారు. సానిటరి ఇన్స్పెక్టర్ పాత్రుడు,డాక్టర్ సోనియా, హెల్త్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

# ఏఎస్ఆర్ స్టేడియం పరిశీలించిన ఎమ్మెల్యే బడేటి

– అల్లూరి విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయింపు



**ఏలూరు,మేజర్ న్యూస్:** స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో మార్నింగ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గత నెల 28 తేదీన శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య ( చంటి)ని వాకర్స్ పెద్దలు కలిసి స్టేడియంలో అల్లూరి సీతారామరాజు విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని దానికి స్థలం కేటాయించాలని కోరగా అందుకు ఒక వారం రోజుల్లో వచ్చి స్థలం కేటాయిస్తానని అన్నారు. అన్నమాట ప్రకారం ఎమ్మెల్యే గురువారం మధ్యాహ్నం వాకర్స్ సభ్యులు జంపా సూర్యనారాయణ,మేడపల్లి ఏసుబాబు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే విచ్చేసి అల్లూరి సీతారామరాజు విగ్రహం పెట్టుకోవడానికి స్థలంను కేటాయించడం పై పలువురు క్రీడాకారులు, వ్యాయామం ఉపాధ్యాయులు,వాకర్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. వాకర్ సభ్యులు అందరూ కలసి త్వరలోనే అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు కు కృషి చేయాలని వాకర్స్ అధ్యక్షులు పత్తిపాటి నాగ విగ్నేష్ పిలుపునిచ్చారు.

## చిన్న వెంకన్న హుండీ ఆదాయం రూ 3కోటి 11లక్షల 12వేల 331లు





**ద్వారకా తిరుమల,మేజర్ న్యూస్:** శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి హుండీల ద్వారా భారీ ఆదాయం సమకూరింది. స్థానిక ప్రమోద కళ్యాణ మండప ఆవరణలో గురువారం ఉదయం ఆలయ ఇన్చార్జి ఈ వో వేంద్ర త్రినాధ రావు ఆధ్వర్యంలో భారీ భద్రతా ఏర్పాట్లు నడుమ దేవాలయ సిబ్బంది హుండీల లెక్కింపు నిర్వహించారు. గడచిన 30 రోజులకు గాను జరిగిన ఈ హుండీ లెక్కింపు లో శ్రీ వారికి నగదు రూపేణ రూ3,11,12,331లు ఆదాయం లభించినట్లు ఆలయ ఇన్చార్జ్ ఈవో త్రినాధ రావు తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన కానుకల రూపేనా 305 గ్రాముల బంగారం,6-455 కేజీల వెండి లభించినట్లు ఈ ఓ పేర్కొన్నారు. పాత నోట్లు 500(38), 1000(3),2000(20), అలాగే 20 విదేశీ కరెన్సీ సైతం హుండీలో ద్వారా లభించినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ క్రమంలో అన్ని విభాగాల సూపరింటెండెంట్ లు, ఆలయ సిబ్బంది, భక్తులు,సేవకులు, పాల్గొన్నారు.

## భక్తుల భాగస్వామ్యంతో శివాలయాల నిర్మాణం



**పెంటపాడు,మేజర్న్యూస్:** భక్తుల భాగస్వా మ్యంతో శివాలయాల నిర్మాణం జరుగుతు న్నాయని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు. గురువారం మండలంలోని కస్పా పెంటపాడు, ప్రత్తిపాడు గ్రామాలలో తలపెట్టిన శివాలయ నిర్మాణ ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. తాడేపల్లిగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ సహకారాలతో ఈ ఆలయ నిర్మాణాలు జరుగుతున్నాయి. టి జి ఎఫ్ విధులనుండి ఈ నిర్మాణాలు జరగనున్నాయి దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు ఈ సైదా,డి శ్రీనివాసచార్యులు, తపతి, ఏఈ నాగేంద్ర కుమార్, పర్యవేక్షించిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతిపాడు కనకదుర్గమ్మ ఆలయం శ్రీధర్, శివాలయ నిర్మాణం చైర్మన్ వీర కృష్ణ,వీర్ల ధనరాజు, వేల రాంబాబు, సైపు నాగేంద్ర కుమార్, కడకట్ల శ్రీనివాస్, ఆరాధ్యుల అంజి, రమేష్, వీర్ల రామ సత్యనారాయణ, తూము పార్ధసారథి ఉన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధిక ఓటింగ్ జరిగేలా కృషి చేయాలి



**దెందులూరు,మేజర్ న్యూస్:** ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సరళి ప్రత్యేకంగా ఉంటుందని ఓటర్లకు దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని,అత్యధిక ఓటింగ్ జరిగేలా కృషి చేయాలని ఎమ్మెల్సీ ఎన్నికల పర్యవేక్షకులు గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ అన్నారు.

అత్యధిక మెజారిటీతో ఎన్డీయే కూటమి అభ్యర్థి విజయం సాధించేలా నియోజకవర్గం నుంచి అన్ని విధాల కృషి చేస్తామని పరిశీలకులు రామకృష్ణ ప్రసాద్ సలహాలు సూచనలు అమలయ్యేలా ప్రతి బూత్ ఇన్చార్జి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే అధ్యక్షతన నియోజకవర్గ కూటమి నాయకులు,ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ల సమావేశంలో గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ ఎన్నికల పోలింగ్ సరళి ,తొలి ప్రాధాన్యత ఓటు, సాధారణ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలకు గల వ్యత్యాసాలు సహా పోలింగ్లో అవలంబించాల్సిన విషయాలపై దిశా నిర్దేశం చేసిన ఎన్నికల పరిశీలకులు.

## మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎంఎల్సీగా గెలిపించాలి : భీమేశ్వర రావు






**ఏలూరు,మేజర్ న్యూస్:** ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రముఖ న్యాయవాది చిక్కా భీమేశ్వర రావు గురువారం ఉదయం 11 గంటలకు ఏలూరు జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు అధ్యక్షతన జరిగిన న్యాయవాదుల సమావేశంలో పాల్గొని ఈ నెల 27వ తేదీన జరగబోవు పట్టభద్రుల ఎన్నికల్లో పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి ఎంఎల్సీగా గెలిపించ వల్సిందిగా అభ్యర్దిస్తూ కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చింతమనేని రమేష్,బీ నానాజీ ఎస్ఎన్ కట్టా కామిశెట్టి రమేష్, ఎం శివరామ కృష్ణ ,నాగమురళి,కూనా కృష్ణారావు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



**ఏలూరు,మేజర్ న్యూస్:** మోటారు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ బి.శేఖర్ అన్నారు. ఏలూరులోని పలు ప్రాంతాలలో రవాణా శాఖాధికారులు గురువారం వాహన తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేశారు.

ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ మోటారు వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. భద్రతా మాసోత్సవాల సందర్భంగా ప్రజలకు, విద్యార్థులకు,ఆటో డ్రైవర్లు,తేలికపాటి, భారీ వాహనాల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించకుండా,డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆ విధంగానే త్రిబుల్ రైడింగ్ చేస్తున్న వారిపై 72 కేసు నమోదు చేశారు. ఇందులో వాహన బీమా పత్రాలు లేనివి. ఆ విధంగానే డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగించే వారపు కూడా కేసులు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో సహాయ వాహన తనిఖీ అధికారులు ఎండి జమీర్ కళ్యాణి పీ నరేంద్రబాబు డి ప్రజ్ఞ, బద్దు, ఎన్ నెహ్రూ కూడా పాల్గొన్నారు.

## 8న సూపర్ లీగ్ మ్యాన్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ టీం ఎంపిక

**ఏలూరు,మేజర్న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఫుట్బాల్ అసోసియేషన్( ఏపీ ఎఫ్ఏ) వారి ఆధ్వర్యంలో ఏపీ సూపర్ లీగ్ మాన్ ఫుట్బాల్ ఛాంపియన్ షిప్ ను అనంతపురం జిల్లా ఆర్.డి.టి సెంటర్లో మార్చి, 2025 నిర్వహిస్తున్నారు. విజేతలకు ఐదు లక్షల రూపాయల వరకు ప్రైజ్ మనీ అందిస్తున్నామని కార్యదర్శి జి.ఎస్.ఎస్. పవన్ కుమార్ తెలిపారు.

ఇందులో పాల్గొనుట కొరకు "కొల్లేరు జోన్ పురుషుల ఫుట్బాల్ జట్టు ఎంపికలను ఏ.పీ.ఎఫ్.ఏ కొల్లేరు జోన్ కోఆర్డినేటర్ వై.శేషగిరిరావు ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ ఉదయం 7.30 నిమిషాలకు ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో ఎంపిక జరుగుతుందని అన్నారు. ప్రతిభ కలిగిన కొల్లేరు జోన్(ఏలూరు,పశ్చిమగోదావరి,ఎన్టీఆర్ కృష్ణ జిల్లాలు) చెందిన పురుష ఫుట్బాల్ క్రీడాకారులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా సూచించారు. ఇందులో ఎంపికైన ఫుట్బాల్ క్రీడాకారుల జట్టు అనంతపురం ఆర్డిటి సెంటర్లో జరగబోవు సూపర్ లీగ్ ఫుట్బాల్ టోర్నమెంట్ లో ఆడవాల్సి ఉంటుందని పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం 2 నామినేషన్లు





– ఇంతవరకు మొత్తం 5 నామినేషన్లు దాఖలు

**ఏలూరు,మేజర్ న్యూస్:** తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి గురువారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు కలెక్టరేట్లో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి వారికి డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన దిడ్ల వీరరాఘవులు, కాకినాడకు చెందిన కాట్రు నాగబాబులు ఒక్కొక్కరు ఒక సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారు. అభ్యర్థులతో రిటర్నింగ్ అధికారి వారు ప్రమాణం చేయించారు. దీంతో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం నాటినుండి ఇప్పటివరకు మొత్తం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి,జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు,ఎన్నికల విభాగం తహసీల్దార్ చల్లన్న దొర తదితరులు ఉన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖరంను గెలిపించాలి

### - కార్యకర్తల సమావేశంలో విప్ బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం,మేజర్ న్యూస్ :** తాడేపల్లిగూడెం జనసేన పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్సీ ఎన్నికలపై తాడేపల్లిగూడెం జనసేన పార్టీ పట్టణ అధ్యక్షులు వర్తనపల్లి కాశి అధ్యక్షతన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ చంద్రబాబు అనుభవం,పవన్ కళ్యాణ్ నిజాయితీ, నరేంద్ర మోడీ సహకారం జోడించి రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు నడిపిస్తున్నానన్నారు. చావు బతుకుల మధ్య ఊగిసలాడుతున్న ఆంధ్రప్రదేశ్ ను మనం చూశాం. పట్టభద్రులు ఎక్కువ శాతం జనసేన వైపు చూస్తున్నారు. రాష్ట్రానికి ఉద్యోగ అవకాశాలు రావాలి. ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు యువత వెళ్ళిపోతున్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భారతీయ జనతా పార్టీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన నాయకులు అడబాల నారాయణమూర్తి, పెంటపాడు మండల అధ్యక్షులు పుల్లా బాబి,తాడేపల్లిగూడెం రూరల్ మండల అధ్యక్షులు అడపా ప్రసాద్, పాలూరి వెంకటేశ్వరరావు, గుండుమోగుల సురేష్, మద్దాల మణికుమార్, కేశవభట్ల విజయ్,చాపల రమేష్,అడ్డగర్ల సూరి, జగత్ సోమశేఖర్,రౌతు సోమరాజు, అడబాల మురళి, నీలపాల దినేష్,బయనపాలేపు ముఖేశ్, కసిరెడ్డి మధులత, లక్ష్మీ ప్రసన్న, పెంటా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# అమలు దశకు చేరుకోని ఏపీలో నదుల అనుసంధానం ప్రాజెక్టులు

### - ఎంపీ పుట్టా మహేష్‌కు కేంద్ర మంత్రి రాజ్ భూషణ్ చౌదరి సమాధానం



**దిల్లీ/ఏలూరు,మేజర్‌న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లో నదుల అనుసంధాన ప్రాజెక్టుల పురోగతి, గత ఐదేళ్లలో కేటాయించిన నిధులు, ఖర్చుపై ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పార్లమెంట్ లో అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి గురువారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. నదుల అనుసంధానికి భారత ప్రభుత్వం జాతీయ దృక్పథ ప్రణాళికను రూపొందించిందని, నదుల అనుసంధానం నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షిస్తుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన నదుల అనుసంధానం ఏ ఒక్క ప్రాజెక్ట్ అమలు దశకు చేరుకోలేదని కేంద్ర మంత్రి బదులిచ్చారు.

ఆంధ్ర ప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల పరిధిలోని మహానంది (మణి భద్ర), మహానది (బార్ముల్), రుషికుల్య, (గోదావరి) లింక్ ప్రాజెక్ట్, ఏపీ పరిధిలోని గోదావరి (పోలవరం), కృష్ణా (విజయవాడ) లింక్ ప్రాజెక్ట్, కృష్ణా (నాగార్జునసాగర్), పెన్నార్ (సోమశిల) లింక్ ప్రాజెక్ట్, ఎఫ్.ఆర్ పూర్తి అయిందని, ప్రత్యామ్నాయ కృష్ణా (నాగార్జునసాగర్), పెన్నార్ (సోమశిల) లింక్ ప్రాజెక్ట్ డిపిఆర్ పూర్తయిందని, కృష్ణా (శ్రీశైలం), పెన్నార్ లింక్ ప్రాజెక్ట్ డ్రాఫ్ట్ డి పి ఆర్ పూర్తయిందని, పేన్నార్ (సోమశిల) కావేరి లింక్ ప్రాజెక్ట్ డిపిఆర్ పూర్తయిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

## మాల సంక్షేమ భవన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బడేటి భరోసా



ఏలూరు, మేజర్ న్యూస్ : గత ప్రభుత్వంలో మాలల సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేసి,అరకొర నిధులతో పూర్తి కాకుండా మిగిలిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మాల ముఖ్యనేతలు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి), ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ యాదవ్ ను కలువగా ఎమ్మెల్యే , ఎంపీ గ్రాంట్స్ నుంచి 40 లక్షలు భవన నిర్మాణానికి ప్రకటించటం జరిగింది. భవన హాల్ నిర్మాణానికి తక్షణ సహాయంగా ఎమ్మెల్యే బడేటి చంటి రూ.1 లక్ష రూపాయలు నగదు అందజేశారు.అందుకు మాల నేతలు హర్షం వ్యక్తం చేశారు,భవన నిర్మాణానికి సంభందించిన పనులను మాల నేతలు పర్యవేక్షించారు. ఈకార్యక్రమంలో మాల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మాలమహానాడు సీనియర్ నాయకులు మెండెం ఆనంద్, లంకపల్లి మాణిక్యాలరావు,కె రవి, దిలీప్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నవ్యాంధ్రప్రదేశ్ అభివృద్ధికి పి-4 కీలకం

### - రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే విజయానంద్



**భీమవరం,మేజర్ న్యూస్:** సచివాలయం నుంచి గురువారం సాయంత్రం ఆయన జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోమాట్లాడుతూ, ప్రభుత్వం, ప్రైవేట్ రంగం, ప్రజల భాగస్వామ్యంతోనే రాష్ట్రం వేగవంతమైన అభివృద్ధిని సాధించగలదని అన్నారు. పి -4 ప్రాముఖ్యతను ఆయన వివరిస్తూ, ఇది వనరుల సద్వినియోగానికి,నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని,ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం పెంచుతుందని తెలిపారు.

పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఇతర సామాజిక సేవలలో మెరుగుదల,మౌలిక సదుపాయాల అభివృద్ధి,పారిశ్రామిక, వ్యవసాయాభివృద్ధి వంటి లక్ష్యాలను పి-4 ద్వారా సాధించవచ్చని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో నోడల్ అధికారికి సహాయంగా ఆరుగురు సభ్యుల బృందం ఉంటుందని, ఈ బృందంలో గ్రామ సచివాలయాల నుండి ఐదుగురు, స్కిల్ డెవలప్మెంట్ నుంచి ఒక యువ నిపుణుడు ఉంటారనీ చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయా అధికారులకు తెలిపారు.పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, డిపిఓ బి.అరుణ శ్రీ, పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, సర్వే అధికారీ శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వలి ఫౌండేషన్ ద్వారా నిత్యవసరాలు అందజేత





**నర్సాపురం,మేజర్ న్యూస్ :** పేద మహిళలకు కొవ్వలి ఫౌండేషన్ ద్వారా ప్రతి నెల అందించే నిత్యవసర సరుకులను చైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు నివాసం వద్ద గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంకు భాస్కర్ నాయుడు, మల్లాడి మూర్తి, నంద్యాల బాబు, యమ్ డి మౌలాలి ఫిబ్రవరి నెలకు సంబంధించి నిత్యవసర సరుకులను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతోమంది పేదలకు నిత్యవసరాలతో పాటు, వైద్యం నిమిత్తం మందులను అందజేస్తున్నట్లు తెలిపారు.కొవ్వలి ఫౌండేషన్ చైర్మన్ కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు ఆర్థిక సహకారంతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొవ్వలి ఫౌండేషన్ స్థాపించిన దగ్గర నుంచి ఈరోజు వరకు ప్రతి నెల నిరుపేదలకు అవసరమైన నిత్యవసరసరుకులు, మందులు, అర్హులైన వారికి ఆపరేషన్లు, గృహ నిర్మాణాలు చేయిస్తున్న తెలిపారు.

# పాలకొల్లు రూరల్ పంచాయతీకి రెండు ఆగ్రో మినీ గ్యాస్ ఫాగర్స్



**పాలకొల్లు,మేజర్ న్యూస్:** పాలకొల్లు రూరల్ పంచాయతీ ఏళ్ళవాని గురువు నందుగల పంచాయతీ ఆఫీసుకు హైదరాబాదు నుండి రెండు ఆగ్రో మినీ గ్యాస్ ఫాగర్స్ తీసుకువచ్చినట్లు పంచాయతీ ప్రత్యేక అధికారి టి.మూర్తి బాబు తెలిపారు,దోమల నివారణలో భాగంగా ఈ మిషన్ల నుండి మలాథిన్ స్మోక్ 9 ప్రాంతాలలో జల్లుతున్నట్టుగా చెప్పారు,శీతాకాలం కావడం దోమల పుట్టుక అధికంగా ఉన్నందున నివారణ చర్యలో భాగంగా ఏర్పాటు చేసినట్లు టిడిపి నాయకులు పాముల రజిని కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్య నిర్వహణ అధికారి సిహెచ్.సత్యనారాయణ, సచివాలయ,పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# కొండల రాయుడుకు ఆర్డీవో రాజు అభినందనలు



**నరసాపురం,మేజర్ న్యూస్:** కేరళ రాష్ట్రం కన్నక్కుల్లం బాయ్స్ సెకండరీ హైస్కూల్ స్పోర్ట్స్ గ్రౌండులో జరిగిన 6వ జాతీయ స్థాయి మాస్టార్ అథ్లెటిక్స్ క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బాగంగా నిర్వహించిన డిస్కస్ త్రో నందు 40 సంవత్సరాల విభాగంలో నర్సాపురం పట్టణం చిన మామిడిపల్లికి చెందిన మండెల కొండలరాయుడు బంగారు పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా మండెల ఆంజనేయ రాయుడు తండ్రి కొండల రాయుడును నర్సాపురం డివిజనల్ అధికారి దాసి రాజు తహసీల్దార్ టి.రాజా రాజేశ్వరి అభినందించారు. తనకు క్రీడలు పట్ల ఉన్న ఆసక్తిని ఆర్డీవో రాజు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా మన ప్రాంతానికి ఇటువంటి మంచి బంగారు పతకాలు తీసుకురావాలని ఆంజనేయ రాయుడును సూచించారు.